# 16. కోత

చీకటితోనే నిద్రలేచిన దగ్గర్నుంచీ మల్లీశ్వరి హడావుడి పడిపోతూ ఉంది. చకచకా పైపైన ఇంటిముందు చిమ్మి నాలుగు చెంబులు నీళ్లు కళ్లాపి చల్లింది.

ఒకపాడి బర్రె, దూడ, కట్టుగారి పడ్డ ఉంటే వాటి దగ్గరా పేడకళ్లు తీసి, చిమ్మి, ఒక తట్ట కసువు అయితే తీసుకుపోయి, నయ్యిదిబ్బలో వేసి వచ్చింది.

మంచంలో ఉన్న ముసలాయనకి అవసరమైన పనిచేసి పొయ్యి దగ్గిర కూర్చుంది. అంట్లు మొత్తం రాత్రే, అన్నాలు తిన్న తరువాత శుభ్రంగా కడిగిపెట్టుకుంది.

ఈ రోజు సెనగ కల్లం.

ఏడాది పొడుగూతా ఎన్నో ఆశలతో, కోరికలతో శ్రమచేసి పండించుకున్న పంటని ఇంటికి తెచ్చుకునే రోజు.

ఏడాదికి ఒకసారి వచ్చే పంట. అందుకే అదోరకమైన ఆనందంతోనూ, ఉత్సాహంతోనూ పనిచేసుకుపోతూ ఉంది.

భర్త అంకమ్మ వేకువజామునే లేచి సెనగకోతకి వెళ్లాడు. తను కూడా వెళ్లేది కానీ పాడి బర్రె, మంచంలో ముసలాయన ఉండటంతో వెళ్లడానికి వీలు కుదరడంలేదు.

రోజూ భర్త కోతకి వెళ్తే, చద్దన్నం తిన్న తరువాత తనూ, భర్తా ఇద్దరూ కలిసి కల్లానికి వెళ్తున్నారు. ఉదయం కోత, తరువాత కల్లం.

ఈ రోజు తమ చేలోనే కోత.

పొద్దున్నే కోత కోసి, తరువాత ట్రాక్టర్‌తో నూర్పించుకుని, తూర్పారపట్టి సందకాడికి పంట ఇంటికి తెచ్చుకోవటమే! ఒక్కరోజుతోనే పని అయిపోతుంది.

ప్రైవేటుకి వెళ్లిన శిరీష వచ్చింది. శిరీష అంటే వాళ్ల కూతురు.

"శిరీషా... ఓటలుకి పోయి మీ తాతకి నాలుగు ఇడ్డెన్లు తెచ్చిపెట్టమ్మా! ఎండ బడితే ఆకలికి ఉండలేదు"

"ఇయ్యాల నేను కూడా తెచ్చుకుంటానమ్మా!"

"రోజూ ఇంట్లో ఎన్నికర్చులు అవతన్నయ్యే? ఇయ్యాల పప్పుచారు కాస్తన్నాకానీ బువ్వ దినిపోరాదూ?"

"నేను రోజూ తెచ్చుకుంటన్నానా ఏందీ? ఎప్పుడో ఒక రోజేగా! డబ్బులియ్యి"

"గూట్లో పదిరూపాయల కాయితం పెట్టాను కానీ తీసకపో" కూతురితో వాదన ఎందుకు అని, విషయం చెప్పి పనిలో మునిగిపోయింది ఆమె.

కొద్దిసేపటికి చేలోకి వెళ్ళిన అంకమ్మ వచ్చాడు.

"కోత మొత్తం అయిందా?" అడిగింది మల్లీశ్వరి.

"కల్లానికి యేసుకోవాల్సి ఉంటే కొరవ ఎట్టపెడతాం? ఐపోయింది"

"కూలీలు ఎంతమంది వచ్చారేంది?"

"ఇరవై ఆరు మందిని తీసకపోయ్యా! ఎకరానికి ఎనిమిది మంది లెక్కన మూడెకరాల మీదా ఇద్దర్ని కలగా తీసకపోయ్యాలే, మల్లీ కొరవ ఏమన్నా పడిద్దేమో అని..."

"మంచోడివే! డబ్బులేమన్నా ఊరక ఉన్నయ్యా? కల్లానికి యేసుకోవాలి కానియ్యిమంటే వాళ్లే కొయ్యకపొయ్యారా?"

"కోస్తారూ, వాళ్లే తెలివితక్కువోళ్లు! ఇంతకీ నువ్వు చేటలు చూసిపెట్టావా? రెండు కలగా ఉంటేనే మంచిది"

"తెచ్చాలే! నువ్వు పోయి మళ్ళీ టాక్టరు వాళ్లకి చెప్పిరా, ఇంకోసారి! ముందు మన చేలో తొక్కిచ్చే ఇంకొకరి చేలోకి పొమ్మను. పదిమందికి వప్పుకుంటారూ. వేళకి రారూ! కల్లం తోటి కూడుకున్న యవారం. పెందలకాడి కాకపోతే చీకట్లో ఇబ్బందిపడాలి"

"ఇప్పుడు వస్తా వేణుబాబు వాళ్లింటికి పోయి చెప్పి వచ్చాలేవే! ముందు మన కల్లం తొక్కించే ఇంకొకరి చేలోకి పోతాను అన్నాడు"

"పరజాలు కూడా చెప్పావుగా?"

"రాత్రే మనకి కావాల్సిన పరజాలు కట్టకట్టిచ్చి పక్కన పడేయించి వచ్చా! పోతా టాక్టరులో యేసుకుని పోవటమే!" మాట్లాడుతూనే అంకమ్మ పళ్ళు తోముకుని, ముఖం కడుక్కుని పీట వేసుకుని కూర్చున్నాడు.

మూడు ఎకరాల చేను. ఇరవై ఆరూ, ఇరవై ఏడు క్వింటాళ్లు కావచ్చు. చేలోనించి వచ్చిన పంటని వచ్చినట్లే పదమూడు వందలు చేసి వ్యాపారులు పట్టుబడి చేస్తున్నారు. తను కూడా రేపే కాటాలు వేసి అమ్ముకుంటే పోతుంది. కూలీ నాలీ, ట్రాక్టర్ల బాడుగా, మందుల బాకీ మొత్తం ఇరవైవేలు ఖర్చులకి పోయినా, పొలం మీద ఇరవై వేలు మిగుల్తాయి.

ఏమిటో... రావటమే కనబడుతోంది కానీ, అంతకు అంత కనబడకుండానే పోతున్నాయి.

ఆలోచిస్తూనే అన్నం తిని బయటకు వచ్చాడు అంకమ్మ.

"ఇయ్యాల మన చేలో కల్లం వేస్తన్నారంటయ్యా?" బయట పంచలో పడుకుని ఉన్న అచ్చయ్య అడిగాడు కొడుకుని.

"ఆ" అన్నాడు అంకమ్మ పొడిగా,

"ఎన్ని గోతాలు అవతయ్యయ్యా?"

"ఎన్నో కొన్ని అవతయ్యిలే! ఎన్ని గోతాలు అయితే నీకు ఎందుకు బాబా? లేనిపోని ఆలోచన్లు పెట్టుకోకుండా గమ్మున పడుకోరాదూ?"

"టాకటేరు చేలోకి పోయిద్దిగా! నన్ను గూడా టాకటేరు ఎక్కిచ్చుకుని చేలోకి తీసకపోయ్యా" ఆశగా అడిగాడు అచ్చయ్య.

తండ్రి మాట్లాడిన ఒక్క మాటకి నవ్వూ, బాధా, జాలీ, దుఃఖమూ కలిగాయి అంకమ్మకి.

అంతకుముందు ఉన్న విసుగు పోయి, ఆప్యాయంగా అన్నాడు.

"నువ్వు ఎందుకు బాబా? నువ్వొచ్చి ఏం చేస్తావే? గతుకుల దారిలో టాక్టరు ఎత్తెత్తి ఏస్తంటే మంచోళ్ళకే పళ్ళిరిగినట్టయి పోయిద్ది. పైగా ఉమ్ము ఊసుకునే సందు లేకుండా టాక్టరు నిండా జనం ఎక్కుతారు, చేలకి పోయేవాళ్ళంతా"

"ఎట్టో కట్ట నన్ను గూడా తీసకపోయ్యా! కల్లాన్ని కంటితో అయినా చూస్తాను"

"వచ్చే ఏడు వద్దువులే. వచ్చే ఏడు నీ అంతట నువ్వే నడిచి చేలోకి వద్దువు" అన్నాడు అంకమ్మ.

పక్షవాతం వచ్చి, కదల్లేక మంచంలో ఉన్నాడు కానీ లేకపోతే ఈ రోజుల్లో బాబు ఇంటి దగ్గర ఉండేవాడేనా?

పొలం అంటే ఆయనకి అంత ప్రేమ, అంత అభిమానం!

ఆయన జీవితంలో అధిక భాగం పొలంలోనే గడిపాడు.

ఆయన పొలాన్ని ప్రేమించాడూ, అభిమానించాడూ, దాని మీద అనురాగం పెంచుకున్నాడు.

తనకు కూడు పెట్టేదీ, గుడ్డ ఇచ్చేదీ, గూడు కల్పించేదీ - అసలు సమాజంలో తనని ఒక మనిషిగా నిలబెట్టేదీ పొలమే అని ఆయన నమ్మాడు. ఆ పొలంలోనే ఆయన అహర్నిశలూ శ్రమించాడు.

బాబు నిరంతర శ్రమజీవే కాదు, నిఖార్సయిన పనివాడు కూడా!

ఇంత మాత్రపు పనివాడు ఊళ్ళో ఎవరూ లేరని పేరు.

నాగలి దున్నడంలో సావాసగాళ్ళతో పందెం పెట్టుకుని, పద్నాలుగు ఎకరాల చదరపు చేలో బెత్తెడు వంకరపోకుండా నాగటి కొండ్ర వేస్తే ఊళ్ళో జనం వచ్చి చూసి ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నారు.

చిక్కాల దగ్గర్నించీ పగ్గాలూ, బండి మోకుల దాకా తాడు వేయడం, తట్ట అల్లడం, అరక దున్నడం, వాములు వేయడం - అసలు ఒక పనేమిటి? ఆయనకి చేతకాని పనిలేదు. ఆ చేసే పనులు కూడా శుద్ధంగా, అందంగా, అపురూపంగా, కళాత్మకంగా ఉండాల్సిందే.

ఇవాళ అన్ని పనులూ ట్రాక్టర్లే చేస్తున్నాయి. అలాంటి పనులు మోటు పనేలు అయిపోయాయి. వాటికి విలువ లేదు. కష్టానికి గౌరవం లేదు.

తనకి పొలంలో మిగులు కనబడుతున్నా, బయట అంతకు రెండురెట్లు అప్పులు ఉన్నాయి.

ఏది ఏమైనా పంట డబ్బు వచ్చిన రోజే పెట్టుబడి బాకీలు తీర్చి, బాబుని మంచి ఆస్పత్రికి తీసుకుపోవాలి. ఇన్ని రోజులూ డబ్బు లేకనే బాబుకి చూపెట్టలేకపోయింది. పదీ, పన్నెండు వేలు ఖర్చు పెట్టుకుంటే లేచి తిరుగుతాడని చిన్న డాక్టర్లు చెప్పారు.

ఇన్నాళ్ళూ ఆయనకి నాటువైద్యం, చిట్కా వైద్యం, చిన్నవైద్యమే గతి అయింది. తన గతి అలా ఉంది మరి!

లక్ష్మీపతి బాకీ ఇరవయ్యారు వేలు ఉంది. ఇయ్యేడు బాకీ మొత్తం తీర్చాల్సిందే అన్నాడు. తను తీరుస్తానని మాట జారాడు. ఆ మాటనే పట్టుకున్నాడు లక్ష్మీపతి.

లక్ష్మీపతి అంటే గోపయ్య కొడుకు.

గోపయ్యా, బాబూ సావాసగాళ్ళు. బాబు మంచి పనివాడూ, నమ్మకస్తుడూ కావడంతో గోపయ్య నమ్మాడు.

ఆయన వ్యాపారస్తుడు.

ఇద్దరూ కలసి ఇరవై ఎకరాలు పొలం కౌలుకి తీసుకుని పత్తి వేశారు. పనిచేయడం, కూలీల్తో చేయించడం, పొలం అజమాయిషీ మొత్తం బాబు చూసుకునే వాడు. అవసరమైన పెట్టుబడి గోపయ్య పెట్టేవాడు. వచ్చిన లాభం సగం సగం తీసుకోవడం!

మొదటి ఏడాది లక్ష రూపాయలు మిగిలాయి. చెరిసగం తీసుకున్నారు.

అప్పటివరకూ పత్తిలో నష్టం ఏమిటో రైతులకి తెలియదు. రెండో ఏడాది ఏకంగా లక్ష రూపాయలు దండగ పడ్డారు.

"ఏం చేద్దాం గోపయ్యా? చూస్తా చూస్తా లక్ష రూపాయలు పోయా!" అని బాబు వెళ్ళి గోపయ్యతో చెప్పి బాధ పడ్డాడు.

"మనం ఏం చేద్దాం అచ్చయ్యా? కానీయ్, పత్తిలో వచ్చిన దండగ పత్తిలోనే పూడ్చుకుందాం" అన్నాడు గోపయ్య.

తరువాత ఏడు కూడా అలాగే పొలం కౌలుకు తీసుకుని పత్తి వేశారు. రెండో ఏడూ నష్టాలు వచ్చాయి.

గోపయ్యకి పెట్టుబడి పెట్టే శక్తీ, ధైర్యమూ పోయాయి.

ఇద్దరూ దిగులు పడ్డారు.

ముందు అనుకున్న మాట ప్రకారం – లాభం వచ్చినా నష్టం వచ్చినా సగం పంచుకోవాలి.

లెక్క చూసుకుంటే అచ్చయ్య ఎనభైవేలు బాకీ తేలాడు. ఉన్నది మూడెకరాల పొలం. లోకంలో పాపం ఎలా పెరిగిపోతోందో వడ్డీ కూడా అలాగే పెరిగిపోతుంది. పెరగడం తప్ప ఎన్నటికీ తరగడం ఎరుగనిది వడ్డీ!

ఎనభై వేల అప్పూ, దానికయ్యే వడ్డీ తను ఎనిమిది జన్మలు ఎత్తినా తీర్చలేడు. ఈ బాకీ తనకి తలకి మించిన బరువు.

ఉన్న పొలంలో రెండెకరాలు గోపయ్యకి రాసి ఇచ్చి, నెత్తి బరువు దించుకోవడం తప్ప మరోదారి కనబడలేదు అచ్చయ్యకి. వాళ్ళింటికి వెళ్ళాడు.

"ఏరా అచ్చియ్యా... బాకీ యవ్వారం ఏం చేద్దాం?" అని ముందు గోపయ్య హెచ్చరించాడు.

"నువ్వే చెప్పరా?"

"తీర్చాల్సింది నువ్వు. బాకీనా పెద్దది. ఎలా తీరుద్దామనుకుంటున్నావో చెప్పు?"

"రెండెకరాలు పొలం రాసిస్తాను. బాకీ రద్దు చేయరా? అంతకంటే నేను చేయగలిగిందేం ఉంది?"

"ఎనభై వేలకి రెండెకరాలా? సరేలే, ఎంతో కొంత! ఎప్పుడు ఖండింపు చేస్తా?"

"నీ ఇష్టం. నువ్వు ఎప్పుడు చేయమంటే అప్పుడు చేస్తా. ఇప్పుడు రమ్మన్నా వస్తా! రేపు బుధవారం పోదాం రిజిష్టారాఫీసుకి" అన్నాడు అచ్చయ్య.

గోపయ్య ఏం జవాబు చెప్పకుండా, ఏదో బాధ పడుతున్నట్లు బరువుగా తల ఊపాడు.

మరుసటి రోజు ఉదయం మంచి బట్టలు వేసుకుని, ప్రయాణానికి సిద్ధమై గోపయ్య వాళ్ళింటికి వెళ్ళాడు అచ్చయ్య.

గోపయ్య ఇంకా ప్రయాణం కాలేదు. అరుగుమీద కూర్చుని ఉన్నాడు.

"బస్సు పోయిద్ది. తొందరగా ప్రయాణం కారా!" అన్నాడు అచ్చయ్య.

"పోవచ్చులే, ఎంతసేపుట్లో పోతాం? అయినా ఓరే, నీకుంది మూడెకరాలు. నాకు రెండెకరాలు రాసి ఇచ్చి ఇంక నువ్వు ఏంచేస్తావురా?"

"నా తంటాలు ఏవో పడతాలే! దేవుడు ఎట్టరాసి ఉంటే అట్ట జరిగిద్ది! మనం దండగలు పడతాం అని పత్రి ఏసామా? మన చేతిలో ఏముంది"

"నువ్వు సుఖబోగాలు అనుభవించడానికి నా దగ్గిర బాకీ చెయ్యాలా! నా దగ్గిర డబ్బు తీసుకుని నువ్వు దాచిపెట్టు కోలా! నువ్వు తిని ఖర్చుపెట్టింది కాదు. పొలంలో చాకిరీ చేసి దండగలుపడ్డాం! ఎందుకో నీ పొలం కండింపు చేయించుకోవడానికి నాకు మనసు వప్పడంలేదురా! నీ బిడ్డల నోటికాడ కూడు తీసినట్టా నేను అట్టచేస్తే!"

"మరేం చేద్దాంరా? సావాసగాడికి బాకీపడ్డానే అని ఎల్లకాలం నన్ను కుమిలి చావమంటా?"

"ఉన్న డబ్బు అంతా ఇట్టపెట్టి నేనూ దెబ్బతిని పొయ్యారా? ఇయ్యాల బిడ్డలు ఎక్కివచ్చారు. నాకూ బాధలు ఉన్నయ్యి! అయినా నీ పొలం నేను కండింపు చేయించుకోలేన్రా?"

"మరేం చేద్దాంరా? నా స్థితి నీకు తెలుసుగదా! డబ్బులు ఎక్కడ తెచ్చియ్య గలను?"

"నిజమే మరి. అయినా నీ పొలం నువ్వే ఉంచుకోరా! ఏటా నీ పొలంలో ఖర్చులు పోయి ఎంత మిగిల్తే అంత తెచ్చియ్యరా?"

"ఒకేడు పండితే రెండేళ్ళు దండగలు పడతంటిమీ! ఇంత బాకీ పొలంలో ఎప్పుడు మిగుల్తయ్యి, ఎప్పుడు తెచ్చియ్యమంటా? ఇది అయ్యేపనేనా?"

"మిగిల్నప్పుడే తెచ్చియ్యి" అన్నాడు గోపయ్య.

"మరి వడ్డీ?"

"అసలు ఇస్తే చాల్లే, వడ్డీ ఏం ఇస్తావ్ ఇంకా?"

గోపయ్య మాటలకి బాబుకి ఆనందంతో కళ్లలో నీళ్లు తిరిగాయి. సావాసగాడు చూపెట్టిన ఆప్యాయతకి నోటినించి మాటలు రాలేదు. ఇది అంతా బాబు స్వయంగా చెబితేనే తనకి తెల్సింది.

అంతమంచివాడూ, దయాగుణం కలిగినవాడు గోపయ్య.

అనుకున్నట్లుగానే పొలంలో పంట పండించీ, చాకిరీచేసి, కూలికీ నాలికీ పోయి చాలా బాకీ తీర్చాడు బాబు.

అనుకోకుండా గోపయ్యకి ముందటేడు క్యాన్సర్ జబ్బు వచ్చింది. తండ్రి ఎంత ఉత్తముడూ, ధర్మాత్ముడో కొడుకు అంత ఛండాలుడు.

"ఓరేయ్, మావోడు పుడతాపుడతానే డబ్బా డబ్బా అంటూ పుట్టేడ్రా! వాడికి డబ్బుయావ తప్ప ఇంకో యావలేదు" అనేవాడు గోపయ్య నవ్వుతూ సందర్భం వచ్చినప్పుడు, బాగున్నరోజుల్లో.

అన్నట్లుగానే ఆ కొడుకు లక్ష్మీపతి డబ్బు పిశాచి!

గోపయ్యని మొదట్లో రెండుసార్లు దగ్గరలో ఉన్న వైద్యుడికి చూపెట్టి ఇక మానుకున్నాడు.

"ఆస్తి అంతా కాజేశావు. నీకు వైద్యం చేయించడానికి డబ్బు నన్ను ఎక్కడ తెమ్మంటావ్? డబ్బుల్లేవ్, ఏంలేవ్" అన్నాడు.

నిజానికి వాళ్ళకి ఆస్తి తక్కువ కూడా ఏంకాదు. బాగానే ఉంది.

చివరలో గోపయ్యకి ఆహారం అమరిక కూడా సరిగాలేదు. ఆ కోడలు కూడా మొగుడికి తగ్గ పెళ్ళామే. బాబు అప్పుడప్పుడూ అరడజను అరటిపళ్ళో, నాలుగు గారెలో కొనుక్కుపోయి ఆయనకి పెట్టి, చాలాసేపు కూర్చుని గుండె దిటవుపడేలా అనునయంగా మాట్లాడి వచ్చేవాడు.

ఆయన అలాగే మంచంలో బాధపడీ, గాయపడీ వెళ్లబుచ్చుకున్నాడు.

ఆయన పోయే నాటికి ఇంకా ఇరవయ్యారు వేలు బాకీ నిలబడిపోయింది.

పోయినేడు వానల్లేకా, పంట పండకా కొద్దిగా కూడా బాకీ జమచేయలేకపోయాడు. అందుకు బాబు కూడా ఎంతో బాధపడ్డాడు. ఇయ్యేడు బాకీ మొత్తం తీర్చాల్సిందే అనీ, తనకి వడ్డీ రావడంలేదని లక్ష్మీపతి పట్టుబట్టి కూర్చున్నాడు. చూస్తే, మొత్తం ఇవ్వడానికి తనకి వీలు కాదు.

ముందు బాబుని మంచి ఆస్పత్రిలో చేర్చాలి. ఎంత ఖర్చు అయినా మామూలు మనిషిని చేయాలి.

కన్న తండ్రికి వైద్యం చేయించలేని బతుకూ ఒక బతుకేనా?

"నువ్వింకా ఈడనే ఉండా! ఏ జాం అవతందీ? తొందరగాపోయి కూలోళ్లని కేకేసిరా! అన్నీ చూసుకుని అదిగో ఇదిగో అని మనం పోయేసరికి నడిజాం అయిద్ది. మనిషికి తొందరలేదేం దాంట?" అంది మల్లీశ్వరి విసుక్కుంటూ.

"పోతన్నా లేవే!" అని బయటకి కదిలాడు అంకమ్మ.

ట్రాక్టరు ట్రక్కులో ఖాళీగోతాలూ, పరజాలూ వేసుకుని, కూలీల్ని ఎక్కించుకుని ఇంటిదగ్గర కూతురికి జాగ్రత్తలు చెప్పిచేలోకి వెళ్లిపోయారు అంకమ్మా, మల్లీశ్వరీ.

* * *

"పొలి పొలి పొలిగో... రావేరా పొలిగో... రారా పొలిగో..." పెద్ద పెద్ద కేకలు పెడుతూ, తూర్పార పడుతున్నారు కూలీలు.

వస్తూ, పోతూ ఉడికిస్తున్న పొలిగాడ్ని కొందరు పెద్దగా బూతులు తిడుతున్నారు.

తూర్పార పడుతుంటే పెరుగుతున్న రాశిని చూసి ఉబ్బితబ్బిబ్బయి పోతున్నారు మల్లీశ్వరీ, అంకమ్మా.

సెనగలు మూసాంబీ రకం. రత్నాల్లా ఉన్నాయి.

ఇంతలో మోపెడ్ మీద వస్తున్న వాళ్లని చూసి మనస్సు కలుక్కుమంది.

లక్ష్మీపతీ, అతని స్నేహితుడూ కల్లం దగ్గరకి వచ్చారు.

వాళ్లని చూసినా, అంకమ్మ ఏం మాట్లాడలేదు. తన పని చేసుకుపోతున్నాడు.

కొద్దిసేపు చూసి లక్ష్మీపతి అన్నాడు."సెనగలు బాగున్నయ్యి అంకమ్మా! దిగుబడి ఏలెక్కన వస్తయ్యి?"

"గోతాలకి పడితే కదూ తెలిసేది?" అన్నాడు అంకమ్మ ముభావంగా.

"బాకీ ఎవారం ఏంచేశా? మొత్తం ఇస్తానని చెప్పావు"

"అప్పుడు అన్నాను కానీ మొత్తం నన్ను ఎక్కడ చూడమంటా? పెట్టుబడి పోవాలి. మా బాబుని ఆస్పత్రికి తీసకపోవాలి. తరవాత ఎంత మిగిల్తే అంత నీకు ఇస్తా!"

"అదేంది అట్టంటావు? నాకు డబ్బు అవసరం. ఎన్నేళ్ళ బాకీ ఇది? వడ్డీ కూడా లేదు! నా బాకీ మొత్తం ఇయ్యాల్సిందే అంకమ్మా! తప్పదు" పెద్ద గొంతుతో అరిచినట్లుగా అన్నాడు లక్ష్మీపతి.

"ముందు మా బాబుని ఆస్పత్రికి తీసుకపోవాలి"

"ఏందీ, మీ బాబుని ఆస్పత్రిలో చేర్చాలా? నీకు పిచ్చి ఏమన్నా పట్టిందేంది అంకమ్మా? ముసలాయన. ఎక్కడికో తీసకపోయి వేలు ఖర్చుపెట్టుకోవటం ఎందుకూ? దిగే పొద్దే కానీ ఎక్కేపొద్దుకాదు! బాకీ పెట్టుకుని దండగమారి పని ఎందుకు చేస్తావు?"

"అందరూ నీ మాదిరిగా ఉండర్లే లక్ష్మీపతీ! నువ్వు తెలివి కలిగిన వాడివైతివీ!" కూలి మనిషి ఒకరు ఎద్దేవాగా అన్నారు.

ఆ మాటని లక్ష్మీపతి పట్టించుకోలేదు.

"కాట్లోళ్లకి సరుకు అమ్మితే నీకు వారం రోజులకి డబ్బు ఇచ్చేది. నేను ఇప్పటికిప్పుడు ఇరవైవేలు ఇస్తా! సరుకు మొత్తం మా ఇంటికి తోలు. మా ఇంటికాడ కాటాలు యేసుకుని బాకీపోగా మిగిలిన డబ్బులు కూడా ఇయ్యాలే తీసుకుందువు!"

అంకమ్మ ఏం మాట్లాడలేకపోయాడు.

తను ఇంతకుముందు మొత్తం ఇస్తానని మాట అన్నాడు. ఇవ్వాల్సిన బాకీ.

రైతుబిడ్డ తను!

కపటం పనికిరాదు. మాట తప్పకూడదు.

బాబు ఎంత నీతిగా, నిజాయితీగా ఉన్నాడో తనూ అలాగే ఉండాలి. ఎప్పుడైనా ఉన్న పీడే ఇది! వదిలించు కుంటేనే పోతుంది.

మొత్తం ఇస్తే బాబుకి వైద్యం ఎట్టచేయించాలి? ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు అంకమ్మ.

"కానిచ్చి గోతాలు ట్రాక్టరుకి ఎత్తండ్రా, మా ఇంటికాడ దించుదాం. మీ బాబు అచ్చయ్య ఎంత నీతివంతుడో, నువ్వూ అంత నీతిమంతుడివి అంకమ్మా! అందుకే మా నాయనకి మీ బాబు అంటే అంత ఇష్టం!"

మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు. దిక్కుతోచకుండా ఉంది అంకమ్మకి.

'దరిద్రుడు! వీడి ఏడుపు తగిలే నిరుడు తనకి పంటరాలేదు. ఇయ్యేడు కూడా మొదట్నించీ వడ్డీలేని బాకీ అని ఏడుస్తూనే ఉన్నాడు. ముందు వీడ్ని వదిలించుకుంటేనే శనిగ్రహం వదుల్తుంది. అప్పోసప్పోచేసి బాబుకి చూపెట్టుకోవచ్చు, ముందు ఈ పీడ పోవటమే మంచిది' అనుకున్నాడు అంకమ్మ. మౌనంగా ఉన్నాడు.

గోతాలు వేసిన ట్రాక్టరు కదిలింది.

తనని ప్రేమించీ, లాలించీ, అనురాగం పంచీ, మమకారం పెంచుకున్న తన గారాల పుత్రుడి అవసరానికి కాకుండా తన ఫలం, ఎక్కడికో పరాయి ఇంటికీ, పరాయిచోటుకీ, పరాయి అవసరానికీ పోతున్నందుకు నేలతల్లి కంటతడి పెట్టుకుంది.

దొడ్డ ఇల్లాలు మల్లీశ్వరి, పవిటచెంగుతో కళ్లుతుడుచుకుంటోంది.

ఈనాడు ఆదివారం - 02 సెప్టెంబర్, 2001